సాక్షి
నంద్యాల
గురువారం ❘ 9 ❘ మార్చి ❘ 2023



సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో బుధవారం సాయంత్రం సాక్షిగణపతికి పంచామృతాలతోనూ, ఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం తదితర పూజలు నిర్వహించారు.



మహిళా శక్తి ఎంతో గొప్పది

మహిళా శక్తి ఎంతో గొప్పదని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య అన్నారు.

8లో

ఉష్ణోగ్రతలు

కనిష్టం	20.1
గరిష్టం	36.4

న్యూస్‌రీల్

కల్యాణం..కమనీయం



మాంగల్యాన్ని భక్తులకు చూపుతున్న అర్చకులు

జూపాడుబంగ్లా: భూదేవి, శ్రీదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి కల్యాణం కమనీయంగా సాగింది. ఈ వేడుక బుధవారం పారుమంచాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో కడు రమణీయంగా జరిగింది. తిరుమల–తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో టీటీడీ నుంచి తెచ్చిన శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి విగ్రహాలను వధూవరులుగా ముస్తాబు చేసి పండితులు కల్యాణం జరిపించారు. భారీగా తరలివచ్చిన భక్తులు స్వామి వారి కల్యాణాన్ని చూసి పరవశించిపోయారు. కార్యక్రమంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి దంపతులు, ప్రధాన అర్చకులు వేణుగోపాలస్వామి దీక్షితులు, సీఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠించిన శ్రీరాముడి విగ్రహం

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని ఎమ్మిగనూరు రహదారిలో అయ్యప్పస్వామి గుడి సమీపంలో శ్రీరామ్ ట్రస్టు ఆధ్వర్యంలో 9 అడుగుల రాముడి విగ్రహ ప్ర తిష్ఠ కార్యక్రమం వై భ వంగా జరిగింది. శ్రీ మఠం పీఠాధిప తి శ్రీ సుభుదేంద్రతీర్థుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నా రు.త్వరలోనే 108 అడుగుల విగ్రహానికి ప్రతిష్ఠిస్తామని విగ్రహం నిర్మాణ దశలో ఉందని ట్ర స్టు సభ్యులుతెలిపారు.సర్పంచ్ తెల్లబండ్లభీమ య్య, జనార్ధన్‌రెడ్డి, బంగారుబాబు ఉన్నారు.

పాక్షికంగా రైళ్లు రద్దు

డోన్ టౌన్: రైల్వే డబుల్ లైన్ పనుల కారణంగా డోన్ రైల్వే స్టేషన్ మీదుగా నడిచే పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లే 07499 నంబర్ రైలు 19వ తేదీ వరకు, నంద్యాల నుంచి కర్నూలుకు వెళ్లే రైలు 20వ తేదీ వరకు పూర్తిగా రద్దు చేశారు. 17228 నంబరు గుంటూరు–డోన్ ట్రైన్ (నంద్యాల నుంచి డోన్‌ల మధ్య), 17227 డోన్ – గుంటూరు ట్రైన్ (డోన్ నుంచి నంద్యాల మధ్య)20వ తేదీ వరకు, 17251 గుంటూరు కాచిగూడ ట్రైన్(నంద్యాల కాచిగూడల మధ్య) 19వ తేదీ వరకు, 17252 కాచిగూడ – గుంటూరు ట్రైన్ 20వ తేదీ వరకు, 17253 గుంటూరు – సికింద్రాబాద్ ట్రైన్(గుంటూరు డోన్‌ల మధ్య), 17254 సికింద్రాబాద్ – గుంటూరు ట్రైన్(డోన్ గుంటూరుల మధ్య)19వ తేదీ వరకు పాక్షికంగా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు: అరికెరలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ, తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అర్హులైన విద్యార్థులు ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశాలకు https://appcet.apfss.in, ఇంటర్మీడియెట్‌కు htt ps://apgpcet.apcfss.in/inter వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బిజీబిజీగా.. గెలుపే లక్ష్యంగా!

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారపర్వాన్ని హోరెత్తిస్తోన్న అభ్యర్థులు
- అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు ప్రచారం
- అభ్యర్థుల కుటుంబసభ్యులు కూడా ప్రచారపర్వంలోనే...
- ఓటరుస్లిప్పుల పంపిణీ నేటితో పూర్తి
- ఎప్పుడూ లేని విధంగా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో 49 మంది అభ్యర్థులతో బ్యాలెట్
- ఉపాధ్యాయబరిలో 12, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పోటీ
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బట్టబయలవుతోన్న టీడీపీ నీచ రాజకీయం

ఎమ్మెల్సీ ఎన్నికల వేడి పెరిగింది. పోలింగ్ తేదీ దగ్గరపడుతుండటంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు ప్రచారజోరు పెంచారు. వారితో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా రంగంలోకి దిగారు. ఆయా పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఇతర రాజకీయనేతలు కూడా ప్రచారం చేస్తున్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి కావడంతో ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తూ కొందరు ప్రలోభాలకు గురిచేస్తున్నారు. 'స్థానిక ఎమ్మెల్సీ' పోరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపు లాంఛనం కావడంతో పార్టీ నేతలు ఇతర రెండు ఎన్నికలపై దృష్టి సారించారు. దీంతో అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల సందడి నెలకొంది.

– సాక్షిప్రతినిధి కర్నూలు



ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి(ఫైల్)

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలక ఘట్టమైన ప్రచార పర్వాన్ని అభ్యర్థులంతా హోరాహోరీగా నిర్వహిస్తున్నారు. వారి బలాబలాలు ఓటర్లకు వివరిస్తూనే ప్రత్యర్థులపై ఆరోపణలు చేస్తున్నారు. ఈ దఫా ఎన్నికల్లో సోషల్ మీడియాను కూడా బలంగా వినియోగించుకుంటున్నారు. రాయలసీమ పశ్చిమ నియోజకవర్గంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు కర్నూలు, నంద్యాల జిల్లా 'స్థానిక సంస్థల'కోటాకు ఈ నెల13న పోలింగ్ జరగనుంది. పట్టభద్రులకోటాలో మొత్తం ఆరు జిల్లాల్లో 3.28 లక్షల మంది గ్రాడ్యుయేట్, 27,716 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,178 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ నెల 13న పోలింగ్ ఉండటంతో 48 గంటల ముందే అంటే శుక్రవారం సాయంత్రానికే మైకులు మూగబోతాయి. ప్రచారానికి రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో అభ్యర్థులు బంధు, అనుచర గణం మొత్తం రంగంలోకి దిగారు.

**బరిలో ఎందరున్నా...
పోటీ కొందరి మధ్యనే**

ఎన్నికల బరిలో ఎందరున్నా పోటీమాత్రం అతికొద్ది మంది మధ్యనే జరగనుంది. పట్టభద్రుల కోటాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూసరవీంద్రారెడ్డి, టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు మధ్య పోటీ నడుస్తోంది. అలాగే ఉపాధ్యాయ ఎన్నికల్లో రామచంద్రారెడ్డి, కత్తి నరసింహారెడ్డి మధ్యనే బలమైన పోటీ నడుస్తోంది. అయితే వీరితో పాటు పోటీలో ఉన్న అభ్యర్థులు కూడా ఎన్నికలను సీరియస్‌గా తీసుకున్నారు. గట్టిగా ప్రచారాన్ని నిర్వహిస్తూ, ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థిస్తున్నారు. టీచర్ ఎమ్మెల్సీలో నగదు పంపిణీ కూడా వేగవంతం చేశారు. ఓ అభ్యర్థి ఓటుకు రూ.3వేలు ఇస్తున్నారు. మరో అభ్యర్థి రూ.5వేలు పంపిణీ చేస్తున్నారు. కొందరి ఓటర్లకు రూ.7వేలు కూడా ఇస్తున్నారు. ఎక్కువ శాతం మంది డబ్బులు తీసుకుంటుంటే, కొందరు ఓటర్లు తిరస్కరిస్తున్నారు.

ఆరోపణలు, ప్రత్యారోపణలతో ప్రచారం

ప్రచారపర్వంలో ఓటరు జాబితా ఆధారంగా ఇంటింటికీ ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మద్దతుగా జిల్లాలోని 14 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు ఇతర నాయకులు, భూమిరెడ్డికి మద్దతుగా టీడీపీ నేతలు, నాగరాజుకు మద్దతుగా కమ్యూనిస్టులు ప్రచారం నిర్వహిస్తున్నారు. 30 ఏళ్లుగా పదోన్నతులు లేకుండా మగ్గిపోతున్న భాషా పండితులకు పదోన్నతులను ప్రభుత్వం ఇచ్చిందని వైఎస్సార్‌సీపీ నేతలు చెబుతున్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు 23శాతం వేతనం పెంచడం, సచివాలయాలను ఏర్పాటు చేసి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాలు కల్పించడంతో పాటు ఇతరత్రా ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ నేతలు వివరిస్తున్నారు. ఇదే క్రమంలో కత్తినరసింహారెడ్డి ప్రచారానికి వెళ్లిన సమయంలో 'పీఆర్‌సీ ఉద్యమం సమయంలో ఎక్కడున్నావ'ని ఓటర్లు, ఉపాధ్యాయ సంఘాలు నేరుగా ప్రశ్నిస్తున్నారు. భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని కూడా టీడీపీ 'న్యాయరాజధాని' కర్నూలుకు రాకుండా అడ్డుపడుతోందని, చంద్రబాబు కర్నూలుకు వచ్చి అన్యాయంగా మాట్లాడారని, ఆపార్టీ తరఫున ఎలా ఓటు అడుగుతున్నారని కొందరు ఓటర్లు టీడీపీ నేతలను ప్రశ్నిస్తున్నారు. అలాగే అభ్యర్థులు కూడా తమ గురించి చెబుతూ ఇతరుల గురించి విమర్శలు చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఆరోపణలు, ప్రత్యారోపణలతో ప్రచారాలను హోరెత్తిస్తున్నారు.

టీడీపీ నీచ రాజకీయం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం ఓట్లు 1,178. ఇందులో వైఎస్సార్‌సీపీకి 1,178, టీడీపీకి 134, స్వతంత్రులు 26, బీజేపీకి 8, సీపీఐ 4, జనసేనకు ఒక్క ఓటు చొప్పున ఉన్నాయి. దీన్నిబట్టి గెలుపు ఎవరిదో స్పష్టంగా తెలుస్తోంది. అయినప్పటికీ టీడీపీ మద్దతులో గెలిచిన సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డితో ఆపార్టీ నేతలు నామినేషన్లు వేయించారు. ఘోర ఓటమి తప్పదని పార్టీ బీఫారం ఇచ్చే ధైర్యం లేక దొడ్డిదారిన నామినేషన్ వేయించారు. వీరి నామినేషన్లతో తమకు సంబంధం లేదని చెబుతూనే మరోవైపు టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి ఓటర్లకు ఫోన్ చేసి మోహన్‌రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అంతేగాక ఎన్నికలకు ఆర్థికంగా కూడా అంతా తానై చూసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే ఎన్నికల్లో ఉన్న 134 ఓట్లు కూడా టీడీపీకి పూర్తిస్థాయిలో రావని, అందులో క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం ఉందని టీడీపీ నేతలే చెబుతున్నారు. మరోవైపు 8 ఓట్ల బలం ఉన్న బీజేపీ కూడా రాఘవేంద్ర అనే అభ్యర్థిని బరిలోకి దించింది. అయితే ఇప్పటి వరకూ జరిగిన ప్రచారం, ఓటర్ల నాడిని పరిశీలిస్తే పట్టభద్రుల కోటాలో వెన్నపూస, ఉపాధ్యాయుల బరిలో రామచంద్రారెడ్డి ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది.



లాయర్లను ఓటు అడుగుతున్న పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు (ఫైల్)



తనకు ఓటు వేయాలని కోరుతున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి (ఫైల్)



టీడీపీ తరఫున ప్రచారం చేస్తున్న ఆ పార్టీ నేత కొల్లు రవీంద్ర (ఫైల్)

పోలింగ్ ప్రక్రియకు సిద్ధం కండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ నోడల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, అడిషనల్ ఎస్పీ రమణ, డీఆర్‌ఓ పుల్లయ్యతో కలెక్టర్ నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 9 లొకేషన్‌లలో సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా చోట్ల అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిపేందుకు నియమించిన నోడల్ అధికారులు సంబంధిత బృందాలతో పోలింగ్ సామగ్రి, పోలింగ్ సిబ్బంది తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలక్టోరల్ రోల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూముల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 61 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు, 30 ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రాలు, 3 స్థానిక సంస్థలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు పోలీస్ సిబ్బందిని మోహరిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ఎలాంటి ప్రచారాలు, కదలికలు ఉండకూడదన్నారు. పోలింగ్ శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు.

రేపటి నుంచి విద్యార్థులకు రాగి జావ

కర్నూలు(సిటీ): ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా శుక్రవారం నుంచి రాగి జావ అందించనున్నట్లు మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారానికి మూడు రోజులు (మంగళ, గురు, శనివారాలు) పాటు రాగి జావను అందించాలని పేర్కొన్నారు. అన్ని స్కూళ్లకు చెందిన ప్రధానోపాధ్యాయులు ఆయా గ్రామాల్లో ఉన్న రేషన్ దుకాణాల దగ్గర రాగి పిండి, బెల్లంను తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓలు, డిప్యూటీ ఈఓలు పర్యవేక్షణ చేయాలన్నారు.

15 నుంచి ఇంటర్ పరీక్షలు

నంద్యాల(సిటీ): ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగనున్నాయని ఆర్ఐఓ గురువయ్య శెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలో 73, నంద్యాల జిల్లాలో 51 కలిపి మొత్తం 124 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొదటి ఏడాది విద్యార్థులు 35,788 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 40,849 మంది పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, ఫర్నీచర్, తాగు నీరు తదితర వసతులు కల్పించామన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌లకు కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల గురించి అవగాహన కల్పిస్తామన్నారు.

పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందాం

- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణంలో బుధవారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌తో కలిసి మంత్రి బుగ్గన ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, స్థానిక సంస్థల అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 18 శాసన మండలి స్థానాల్లో 14 స్థానాలను ఎస్సీ, బీసీ, మైనార్టీలకు కేటాయించి బడుగు బలహీన వర్గాలకు పెద్ద పీట వేశారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించారని, ఓటు వేసి గెలిపించాలని ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డు కౌన్సిలర్లను కోరారు. సమావేశంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు మూర్తుజావలీ, నాయకులు బాబుల్ రెడ్డి, నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, ఖాజా, తిరుమలేశ్వర్‌రెడ్డి, అజాం బాషా పాల్గొన్నారు.

గరుడ గమనం.. గోవిందుడి అభయం

- వైభవోపేతంగా గరుడోత్సవం
- ముగిసిన ఎగువ అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు



గరుడవాహనంపై కొలువైన నరసింహస్వామి



గరుడోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆళ్లగడ్డ: అహోబిల బ్రహ్మోత్సవాల సందర్భంగా చివరి రోజైన మంగళవారం అర్ధరాత్రి అనంతరం ఎగువ అహోబిలంలో వెలసిన శ్రీ ఉగ్రనరసింహస్వామి గరుడోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి నిత్యపూజల అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జ్వాలనరసింహస్వాములను కొలువుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్వాల నరసింహస్వామిని గరుడ వాహనంలో అధిష్ఠింపజేసి భక్తుల గోవిందా నామస్మరణల మధ్య అట్టహాసంగా ఊరేగించారు. గరుడ మహోత్సవ వేడుకలు బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. అంతకుముందు ఉదయం ఉత్సవం, సాయంత్రం ద్వాదశారాధన తర్వాత రాత్రి గరుడోత్సవం నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున ఎగువ అహోబిలం బ్రహ్మోత్సవాలు ముగిసిన సందర్భంగా శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం చేపట్టారు.

క్లుప్తంగా

ముగ్గురికి ఎస్‌ఐలుగా పదోన్నతి

కర్నూలు: సీనియారిటీ ప్రాతిపదికన ముగ్గురు ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ కౌంటర్ డీఓను బుధవారం విడుదల చేశారు. మద్దికెర పీఎస్‌లో పనిచేస్తున్న 1989 బ్యాచ్‌కు చెందిన ఏఎస్‌ఐ కృష్ణమూర్తి, కర్నూలు త్రీటౌన్‌లో పనిచేస్తున్న విశ్వనాథ్‌రెడ్డికి పదోన్నతి కల్పించి అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే కొత్తపల్లి పీఎస్‌లో పనిచేస్తున్న 1987వ బ్యాచ్‌కు చెందిన రామ్‌నాథ్‌ను నంద్యాల జిల్లాకు కౌన్సెలింగ్‌లో అలాట్ చేస్తూ ఉత్తర్వులో పేర్కొన్నారు. దొర్నిపాడు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన విశ్వనాథ్‌రెడ్డి 1987లో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరారు. 2011లో హెడ్ కానిస్టేబుల్, 2014లో ఏఎస్‌ఐగా పదోన్నతి పొందారు. 2005, 2006 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో నక్సల్స్ పేరుతో పలు దొంగతనాలకు పాల్పడి రెండు రాష్ట్రాలకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న పెద్దేటి గొల్లల గ్యాంగ్‌ను పట్టుకోవడంలో ప్రతిభ కనపరచి పోలీసు శాఖ ఉన్నతాధికారులతో ప్రశంసలు పొందారు.

తల్లీ, కూతురు అదృశ్యం


అదృశ్యమైన తల్లీ, కూతురు(ఫైల్)

పగిడ్యాల: మండల పరిధిలోని ముచ్చుమర్రికి చెందిన తల్లీకూతురు బుధవారం అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తెలుగు మద్దిలేటికి తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం బొంగూరు గ్రామానికి చెందిన రుక్మిణికి నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమార్తె హిమజ ఉంది. మద్దిలేటి ఉదయం కరెంట్ పని చేసేందుకు బయటకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకోగా భార్య, కూతురు కనిపించలేదు. చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లేకపోవడంతో ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. తల్లీకూతురు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

మహిళా శక్తి ఎంతో గొప్పది

- వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు కాటసాని, రామయ్య
- పార్టీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం, హోలీ వేడుకలు
- ఆటలతో సంబరాలు చేసుకున్న మహిళా ప్రజాప్రతినిధులు


కేక్ కట్ చేస్తున్న కాటసాని, బీవై రామయ్య, చిత్రంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్): మహిళా శక్తి ఎంతో గొప్పదని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం, హోలీ పండుగ సందర్భంగా బుధవారం పార్టీ కార్యాలయ ఆవరణలో వేడుకలు నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సతీమణి ఉమామహేశ్వరమ్మ, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి సతీమణి విజయమనోహరితో పాటు మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ చైర్మన్లు, కార్పొరేటర్లు, పార్టీ నాయకురాళ్లు, కార్యకర్తల మధ్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా హోలీ ఆడి రంగులు చల్లుకున్నారు. మ్యూజికల్ చైర్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా కాటసాని, రామయ్య మాట్లాడుతూ స్త్రీలకు సమాజంలో గౌరవం కల్పించిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థలతో పాటు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. అమ్మ ఒడితో పాటు సంక్షేమ పథకాల్లో 90 శాతం మహిళల పేరుతోనే మంజూరు చేస్తున్నారని గుర్తు చేశారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా ఎదిగేందుకు సీఎం జగన్ చేసిన మేలు మరువలేనిదన్నారు. మహిళల భద్రత విషయంలో ఎంతో గొప్పగా ఆలోచించి దిశ చట్టాన్ని తెచ్చారని, సంరక్షణ కోసం దిశ యాప్, దిశ పోలీసు స్టేషన్లు, దిశ వన్‌స్టాప్ సెంటర్లు తెచ్చిన నాయకుడన్నారు. ఆయన 30 ఏళ్లు సీఎంగా ఉంటేనే మహిళా లోకం క్షేమంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం మహిళా ప్రజా ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళ, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వైజ అరుణ, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, పద్మలత, అర్షియ హర్షిన్, పుల్లమ్మ, మునెమ్మ, లక్ష్మీ, మహిళ విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మీ, పార్టీ నాయకురాళ్లు సుధా, ఎం. రేణుకమ్మ, సుభాషిణి, వేదవతి, నారాయణమ్మ, పార్టీ పరిశీలకులు కర్రాహర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు మహేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, సీహెచ్ మద్దయ్య, ధనుంజయ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువును ప్రోత్సహించాలి

- కలెక్టర్ సతీమణి స్వర్ణలత



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సతీమణి స్వర్ణలత

కర్నూలు(హాస్పిటల్): బాలికల చదువును ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సతీమణి స్వర్ణలత అన్నారు. బుధవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని ఆడిటోరియంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ సతీమణి స్వర్ణలత మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళల సమాన భాగ్యస్వామ్యంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి తల్లి తన పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ఉమాదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులు అమ్మాయిలను అబ్బాయిలతో సమానంగా చదివించాలన్నారు. అనంతరం జాతీయ స్థాయిలో కురుక్షేత్రలో జరిగిన 400 మీటర్ల రిలే పోటీల్లో సిల్వర్ మెడల్, 100 మీటర్ల రిలే పోటీల్లో కాంస్య పతకం సాధించిన కానిస్టేబుల్ లలితను, జాతీయ స్థాయిలో 2020-21లో వారణాసిలో జరిగిన 4/400 రిలే గేమ్‌లో బంగారు పతకం, 800 మీటర్ల రన్నింగ్ పోటీలో కాంస్య పతకం, లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించిన బి. తాండ్రపాడు లోని డైట్ కాలేజి లెక్చరర్ వెంకటసుబ్బమ్మను సత్కరించారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈవో పీవీ రమణ, ఉమెన్ వెల్ఫేర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సరస్వతి, జిల్లా సైన్స్ ఆఫీసర్ రంగమ్మ, జ్ఞానేశ్వరమ్మ, మహిళా అధికారులు పాల్గొన్నారు.

స్త్రీల త్యాగం వెలకట్టలేనిది

- జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి


కేక్ కట్ చేస్తున్న జాయింట్ కలెక్టర్ నిశాంతి, మహిళా ఉద్యోగులు

నంద్యాల: కుటుంబం కోసం, సమాజాభివృద్ధి కోసం మహిళలు చేసే త్యాగం వెలకట్టలేనిదని జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటనరీ హాల్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. దేశ అధ్యక్షుల నుంచి కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, జడ్జీలు, డాక్టర్స్, లాయర్స్, బ్యాంకర్స్, టీచర్స్, సైంటిస్టులుగా రాణిస్తున్నారన్నారు. జిల్లా జడ్జి అర్చన మాట్లాడుతూ సమాజంలో మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వాలన్నారు. అడిషనల్ ఎస్పీ రమణ మాట్లాడుతూ మహిళల రక్షణకు పోలీసు యంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందన్నారు. ఐసీడీఎస్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మహిళలందరికీ సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరమన్నారు. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ కో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఈసీహెచ్ శ్రీనివాసరావు, డీఈవో అనూరాధ, కమాండ్ కంట్రోల్ రూం సూపరింటెండెంట్ నాగమణి మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని సప్తగిరి అపార్ట్‌మెంట్‌లో బుధవారం పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. సప్తగిరి అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న శ్యామ్‌సుందర్ జియో నెట్‌వర్క్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని దొంగ తాళాలు పెకిలించి ఇంట్లోకి చొరబడి 6 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు అపహరించుకుని వెళ్లాడు. ఇంటికి తిరిగి వచ్చిన బాధితుడు చోరీ జరిగిదని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

రెండు మోటార్ సైకిళ్లు ఢీ

- ఒకరు మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు


మృతి చెందిన మోహన్

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురం-అహోబిలం రహదారిపై బాలస్వామి బావి వద్ద బుధవారం రాత్రి రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు. గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన మోహన్(42), మధు మోటార్ సైకిల్‌పై అహోబిల లక్ష్మీనరసింహ్మస్వామి బ్రహ్మోత్సవాలు తిలకించి స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. అదే సమయంలో నర్సాపురం గ్రామానికి చెందిన అల్లాబకాష్, ఆదికేశవులు మరో మోటార్ సైకిల్‌పై అహోబిలానికి బయలుదేరారు. రెండు బైక్‌లు బాలస్వామి బావి వద్దకు చేరుకోగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో మోహన్ అక్కడికక్కడే మృతి చెందగా బైక్‌లపై ఉన్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నిరంజన్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంగవరంలో మారెమ్మ దేవర


మారెమ్మవ్వకు బోనాలు తీసుకెళుతున్న భక్తులు

నందవరం: డప్పు దరువులు, మేళతాళాల మధ్య గ్రామ దేవర ఘనంగా జరిగింది. పురవీధుల్లో బారులు తీరిన భక్తుల మధ్య కుంభోత్సవం కనువిందు చేసింది. బుధవారం మండల పరిధిలోని గంగవరంలో గ్రామ దేవత మారెమ్మవ్వ దేవర నిర్వహించారు. నూతన ఆలయంలో మారెమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించి విశిష్ట పూజలు నిర్వహించారు. వేకువజామున గ్రామ దేవతలకు ప్రజలు ప్రత్యేక పూజలు చేపట్టారు. సంప్రదాయంలో భాగంగా అమ్మవారికి బోనాలు నైవేద్య సమర్పణ గావించారు. వేకువజామున బలిదానాలు కానిచ్చి ఉదయం కుంభోత్సవాలు నిర్వహించారు. డప్పుల దరువులతో అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు ధరించి పిండి వంటలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బలిదానాలు కానిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దేవర ఉత్సవంలో సర్పంచ్ బైటిగేరి శివన్న, మాజీ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, ఎంపీటీసీ విజయ్‌మోహన్ రెడ్డి, గ్రామపెద్దలు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రహ్లాదరెడ్డి, వెంకట్రామిరెడ్డి, జయరామిరెడ్డి, రఘు, దస్తగిరి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవరలో పొట్టేళ్ల పందేలు

మారెమ్మ దేవర పురస్కరించుకుని బుధవారం పొట్టేళ్ల పోటీ నిర్వహించారు. భక్తులు బోనాలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా ఈ పోటీ నిర్వహించారు. పెద్ద పెద్ద పొట్టేళ్లతో సాగిన ఈ పోరు చూపరులను ఆకట్టుకుంది.

వివాహిత ఆత్మహత్య

వెలుగోడు: మండల పరిధిలోని బోయరేవుల గ్రామానికి చెందిన రాజేశ్వరి(23) ఆత్మహత్య చేసుకుంది. పాల్వంచ పట్టణానికి చెందిన రాజేశ్వరికి బోయరేవుల గ్రామానికి చెందిన నాగార్జునతో వివాహమైంది. కొంతకాలంగా రాజేశ్వరి అనారోగ్యంతో బాధ పడుతోంది. హైదరాబాద్‌లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆలూరు: దేవనకొండ మండలం ఈదులదేవరబండ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు మచాపురం గ్రామానికి చెందిన కురుబ చిన్నకొలుట్ల (32) పి.కోటకొండ గ్రామంలో జరిగిన గ్రామ దేవరకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దేవనకొండ పోలీసులు తెలిపారు.

సంతెకూడ్లూరులో వింత ఆచారం


ఆడవారి వేషంలో ఆలయానికి వెళ్తున్న పురుషులు

ఆదోని రూరల్: హోలీ పండుగను సంతెకూడ్లూరు గ్రామంలో విభిన్నంగా జరుపుకున్నారు. మగవారు ఆడవేషం వేసి కలశాలతో రతీమన్మథుల ఆలయాని వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆచారం దాదాపు 300 ఏళ్ల నుంచి కొనసాగుతోందని గ్రామస్తులు తెలిపారు. వేడుకలను తిలకించేందుకు కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

పి.కోటకొండలో దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణమా?


హతుడు సూర్యప్రకాష్(ఫైల్)

ఆలూరు: దేవరకు వెళ్లిన ఓ వ్యక్తిని దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామంలో బుధవారం రాత్రి దారుణంగా హత్య చేశారు. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని తెలుస్తోంది. హతుని బంధువులు, ఎస్‌ఐ భూపాలుడు తెలిపిన వివరాల మేరకు.. పి.కోటకొండ గ్రామానికి చెందిన బోయలింగన్నకు ముగ్గురు కుమార్తెలు ఉండగా వీరికి వివాహం చేశారు. గ్రామంలో దేవర నిర్వహిస్తుండడంతో కుమార్తెలతో పాటు అల్లుళ్లు కృష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామానికి చెందిన సూర్యప్రకాష్ (25), వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామానికి చెందిన రవి, జయరాములను పిలిపించారు. వరుసకు వదిన అయిన మహిళతో సూర్యప్రకాష్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీంతో ఆగ్రహించిన లింగన్న, రవి, జయరాము బుధవారం రాత్రి అందరూ చూస్తుండగానే ఇంటిముందే సూర్యప్రకాష్‌పై కత్తులతో దాడి చేసి నరికి చంపారు. విషయం తెలుసుకుని హతుడి కుటుంబ సభ్యులు, సమీప బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ముగిసిన కామన్న వేడుకలు

- ఆకట్టుకున్న హాస్య సన్నివేశాలు


కామన్న(మన్మథ) శవాన్ని కాటికి తీసుకెళ్తున్న హాస్య సన్నివేశం

హొళగుంద: మండల కేంద్రమైన హొళగుందలో బుధవారం కామన్న (మన్మథ) వేడుకలు ముగిశాయి. హాస్య కార్యక్రమాలు ప్రజలను కడుపుబ్బా నవ్వించాయి. కామ్మన్న వేడుకలు రతీ మన్మథుల కథతో ముడిపడి ఉన్నాయి. దేవతలను రాక్షసులు పీడిస్తుండగా వారు మన్మథుడి దృష్టికి తీసుకొస్తారు. అప్పుడే రతిని పెళ్లి చేసుకున్న మన్మథుడు రాక్షసులను సంహరణ కోసం ఈశ్వరుడి వద్దకు వెళ్తాడు. తపస్సులో ఉన్న ఈశ్వరుడును లేపడానికి పలు రకాల వేషాలతో తపస్సుకు భంగం కలిగిస్తాడు. దీంతో కోపోద్రిక్తుడైన ఈశ్వరుడు మూడో కంటిని తెరిచి మన్మథుడిని బూడిద చేస్తాడు. విషయం తెలిసి రతి, దేవతలు ఈశ్వరుడిని వేడుకొనగా మరో రూపంతో మన్మథుడికి పునర్జన్మనిస్తాడు. దీంతో వారు మరో సారి పెళ్లి చేసుకుని సంబరాలు చేసుకుంటారు. ఈ కథ ఆధారంగా మంగళవారం రాత్రి హొళగుందలో కామన్న(మన్మథ) దహనం, బుధవారం ఉదయం శవ ఊరేగింపు, కామన్నకు పునర్జన్మ రావడంతో మన్మథుడు, రతి పెళ్లి ఊరేగింపు నిర్వహించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగు నీళ్లు చల్లుకున్నారు.

బైక్‌లోని రూ. 6 లక్షలు మాయం

ఎమ్మిగనూరురూరల్: బ్యాంక్‌లో డబ్బులు డ్రా చేసుకొని బైక్ బ్యాగ్‌లో పెట్టుకొని ఇంకి వచ్చి చూస్తే మాయమైన సంఘటన పట్టణంలో బుదవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసముండే ప్రతాప్‌కృష్ణ మూర్తిశెట్టి మార్కెట్ యార్డ్‌లో వ్యాపారం చేస్తున్నాడు. రోజు మాదిరిగానే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో రూ.6 లక్షలు నగదు డ్రా చేసుకొని హోండా షైన్ బైక్‌లో పెట్టుకున్నాడు. బ్యాంక్ ముందు బైక్ దగ్గరనే తెలిసిన వ్యక్తి కనిపిస్తే మాట్లాడాడు. ఇంటికి వచ్చి చూస్తే బైక్‌లో బ్యాగ్‌లో డబ్బులు కనిపించకపోటంతో భయపడి రోడ్డులో ఏమైన పడ్డాయేమోనని వెతికాడు. ఎక్కడా కనపించలేదు. దీంతో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. పట్టణ పోలీసులు బ్యాంక్ నుంచి ఇంటి వచ్చిన ప్రాంతాల్లోని సీసీ పుటేజీని పరిశీలిస్తున్నారు. గాంధీనగర్‌లోని షాప్స్‌లోని సీసీ పుటేజీలను కూడా పరిశీలిస్తున్నారు. బైక్‌లో డబ్బులు పెట్టుకున్నప్పుడు అపరిచిత వ్యక్తి గమనించి డబ్బు తీశాడా, దారిలో పడేసుకున్నారా అనేది ఎవరికి అంతుపట్టడం లేదు. విచారిస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

వ్యాధి లక్షణాలు అవే గానీ..

- పెరుగుతున్న వైరల్ ఫీవర్ కేసులు
- జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి లక్షణాలు
- ఆసుపత్రులు, మెడికల్ షాపుల వద్ద రద్దీ
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జనరల్ మెడిసిన్ విభాగం వద్ద కిక్కిరిసిన రోగులు

ఏమిటీ ప్రతి ముగ్గురిలో ఒకరు దగ్గుతున్నారు. ముక్కు చీదుతున్నారు. జ్వరంతో వణికిపోతున్నారు. పైగా గొంతునొప్పి కూడా. మళ్లీ ఇదేమైనా...అంటూ జనాల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇటీవల సోషల్‌మీడియాలో వస్తున్న సమాచారం మేరకు మళ్లీ మహమ్మారి కోవిడ్ వస్తుందేమోనని భయపడుతున్న వారూ ఉన్నారు. కానీ అదేమీ కాదని, జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని వైద్యులు సూచిస్తున్నారు.

కర్నూలు(హాస్పిటల్): మహాశివరాత్రి పండగ అనంతరం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అప్పటి వరకు చలిగా ఉన్న వాతావరణం కాస్త వేడిగా మారింది. పగటి ఉష్ణోగ్రతలు నాలుగైదు డిగ్రీలు పెరిగాయి. కానీ రాత్రివేళ ఇంకా చలిగానే ఉంటోంది. ఉదయం 7 గంటల వరకు చల్లగాలులు వీస్తున్నాయి. రాత్రి చలి, పగలు ఎండ ఇదేమి వాతావరణమన్న అనుమానాలు ప్రతి ఒక్కరిలో కలుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఫ్లూ దాడి చేస్తోంది. సీజన్ మార్పు (చలికాలం నుంచి వేసవికి మార్పు) సమయంలో వైరస్‌లు విజృంభిస్తాయి. ఈ క్రమంలో ఫ్లూ లక్షణాలతో ప్రతి ముగ్గురిలో ఒకరు బాధపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. కర్నూలులోని బోధనాసుపత్రితో పాటు ఆదోని, ఎమ్మిగనూరులలోని ప్రభుత్వ ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, అర్బన్‌హెల్త్ సెంటర్లకు దగ్గు, జ్వరం, జలుబు లక్షణాలతో చికిత్స కోసం వెళ్లే వారి సంఖ్య పెరిగింది.

కోవిడ్ లక్షణాల వలే...

కోవిడ్-19కు ఎలాంటి లక్షణాలు ఉన్నాయో ఇప్పుడు వచ్చిన ఫ్లూనకు కూడా అలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఫ్లూ ఉన్న వారిలో జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లునొప్పులు, గొంతునొప్పి వేధిస్తున్నాయి. అయితే, ఇదేమీ కోవిడ్-19 కాదని వైద్యులు చెబుతున్నారు. సీజన్ మార్పు సమయంలో సాధారణంగా వచ్చే వైరల్ ఫీవర్లేనని పేర్కొంటున్నారు. ఫ్లూ వచ్చినవారు ముఖానికి మాస్క్ ధరించాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, ఇతరులకు కాస్త దూరంగా ఉంటే సరిపోతుందని సూచిస్తున్నారు.

మెడికల్‌షాపుల నుంచే చికిత్స

ప్రైవేటు ఆసుపత్రికి వెళితే ఖర్చు అధికమవుతుందని భావించే చాలా మంది ఆసుపత్రులకు వెళ్లకుండా మెడికల్ షాప్‌లకు వెళ్లి మందులు కొని వాడుతున్నారు. వ్యాధి లక్షణాలు చెప్పడంతో మెడికల్‌షాపుల వారు అందుకు సంబంధించిన మందులు ఇచ్చేస్తున్నారు. రెండు, మూడు రోజులు వాడినా తగ్గలేదని మళ్లీ వచ్చిన వారికి యాంటిబయాటిక్స్ కూడా దుకాణాల్లో విక్రయిస్తున్నారు. అయితే ఇవి కూడా ఓ రెండు, మూడు రోజులు వాడేసి ఊరుకుంటున్నారు. దీనివల్ల డ్రగ్‌రెసిస్టెన్సీ పెరిగి యాంటిబయాటిక్స్ పని చేయని పరిస్థితి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వైద్యుల సూచన లేకుండా మందులు వాడొద్దని సూచిస్తున్నారు.

వైద్యుల సూచనతోనే మందులు వాడాలి



ఇటీవల కాలంలో చాలా మంది వైద్యుల సూచన లేకుండా నేరుగా మెడికల్‌షాపులకు వెళ్లి మందులు కొని వాడుతున్నారు. ఇలా వాడటం చాలా ప్రమాదకరం. ప్రతి యాంటిబయాటిక్‌కు కొన్ని రకాల సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. కొన్ని రకాల మందులు కొందరికి పడవు. ఇవన్నీ పరిగణలోకి తీసుకుని రోగికి వైద్యులు మందులు సూచిస్తారు. ఎవ్వరికి వారు మందులు కొని వాడటం ద్వారా డ్రగ్ రెసిస్టెన్సీ పెరిగి భవిష్యత్‌లో వ్యాధులు వస్తే ఏ మందూ పనిచేయకుండా అవుతుంది.

–డాక్టర్ మీనిగ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్ విభాగం, జీజీహెచ్, కర్నూలు